**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

పాఠశాల దశన బడిపిల్లలందరూ
పద్య,గద్యములను శ్రద్ధ తోడ
చదివి,రాసి చూసి చక్కదిద్దయకొనగ
వెలుగుచుండునెపుడు విద్యలోన

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.

సంచిక : 356 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 23-04-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

# ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్

## డిపోలకే పరిమితం అయిన బస్సులు

- డిపోల ముందు ధర్నాలతో కార్మికుల నిరసన
- నగరంలో అద్దె బస్సులను ఫ్రగీ తిప్పిన ప్రభుత్వం
- చాన్నాళ్లకు ఆటోలు, క్యాబ్‌లకు పెరిగిన గిరాకీ
- కరీంనగర్‌లో లారీని ఢీకొట్టిన అద్దె బస్సు
- నగరంలో మెట్రో సర్వీసులను పొడగించిన సర్కార్
- కార్మికుల సమస్యలపై సానుకూలంగా ఉన్నాట్లు ఎండి వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): చాలాలకాలం తరవాత ఆర్టీసీ బస్సులు సేదదీరుతున్నాయి. సమ్మె కారణంగా అన్ని బస్సులు ఆయా డిపోలకే పరిమితం అయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో బస్ డిపోల్లో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. డిపోల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. -మిగతా 2 లో






# నేపాల్‌లో మళ్లీ నిరసనలు..

- బాలెన్ షా సర్కార్‌కు నెల రోజుల్లోనే నిరసనల సెగ
- అవినీతి ఆరోపణలతో హోం మంత్రి గురుంగ్ రాజీనామా

కాఠ్మాండూ ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): భారీ మెజారిటీతో పదవి చేపట్టిన నేపాల్ ప్రధాని బాలెన్ షాకు నెల రోజుల్లోపే ప్రజలు, విద్యార్థుల నుంచి నిరసన సెగ తగిలింది. రాజధాని కాఠ్మాండూ సహా పలు నగరాల్లో విద్యార్థులు, రాజకీయ గ్రూపులు, సామాన్యులు వీధుల్లోకి వచ్చి ప్రభుత్వ విధానాలపై గత రెండు, మూడు రోజులుగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. భారత్ నుంచి కొనుగోలు చేసే రూ.100 పైబడిన వస్తువులపై కస్టమ్స్ డ్యూటీ విధించడాన్ని సామాన్యులు తప్పు పడుతున్నారు. -మిగతా 2 లో

## తెరుచుకున్న కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు



2 లో



# లక్నోను చిత్తు చేసిన రాయల్స్..

- లక్నో లో వరుసగా ఏడో మ్యాచ్‌లో ఎల్ఎస్‌జీ ఓటమి
- రాజస్థాన్ చేతిలో 40 పరుగుల తేడాతో చిత్తు
- డకౌట్ అయిన బదోని, పంత్, మార్‌క్రమ్

న్యూఢిల్లీ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో వరుసగా రెండు ఓటముల తర్వాత రాజస్థాన్ రాయల్స్ కమ్ బ్యాక్ ఇచ్చింది. వరుసగా నాలుగు విజయాలతో టోర్నీని ఆరంభించిన రాజస్థాన్.. ఆ తర్వాత రెండు మ్యాచులలో ఓడింది. తాజాగా లక్నో సూపర్ జెయింట్స్‌పై గ్రాండ్ విక్టరీ సాధించి.. మళ్లీ విజయాల బాట పట్టింది. లక్నోలోని ఏకనా క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచులో రాజస్థాన్ రాయల్స్.. లక్నో సూపర్ జెయింట్స్‌ను 40 పరుగుల తేడాతో ఓడించింది. దీంతో పాయింట్స్ టేబుల్‌లో రెండో స్థానానికి చేరింది.ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్.. నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 159/6 పరుగులు మాత్రమే చేసింది. టాస్ గెలిచి బౌలింగ్ -మిగతా 2 లో



# నేడు రెండు రాష్ట్రాల్లో పోలింగ్

- తమిళనాడు, బెంగాల్‌లో ఏర్పాట్లు పూర్తి
- భద్రత కట్టుదిట్టం
- మే 4న ఫలితాలు

న్యూఢిల్లీ


దేశంలో ఎంతో ఉత్కంఠను రేపుతున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు నేడు (గురువారం) జరగనున్నాయి. ఇందుకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ప్రజలు ఓటు హక్కు ద్వారా వివిధ పార్టీల అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. తమిళనాడులో మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు నేడు ఒకే దశలో ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో మొత్తం 294 నియోజకవర్గాలకు గానూ రెండు దశల్లో ఎన్నికలు జరగనుండగా.. అందులో మొదటి దశలో భాగంగా 152 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మిగతా 142 స్థానాలకు ఈనెల 29న పోలింగ్ జరగనున్నది. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం -మిగతా 2 లో

# కాల్పుల విరమణ పొడిగింపు

## చర్చలు ముగిసే వరకు అమలులో ఉంటుందన్న ట్రంప్

- ఇరాన్ ఓడరేవుల దిగ్బంధం కొనసాగుతుందని స్పష్టీకరణ
- ఇది ఆకస్మిక దాడుల కోసం ఆడుతున్న నాటకం : ఇరాన్

ఇరాన్‌తో కుదుర్చుకున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. చర్చలు ముగిసే వరకూ, ఇరాన్ నేతలు, ప్రతినిధులు ఏకీకృత ప్రతిపాదనతో ముందుకొచ్చే వరకూ ఈ పొడిగింపు అమలులో ఉంటుందని, ఆ దేశంపై దాడులు చేయబోమని ఆయన చెప్పారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించే ప్రశ్నే లేదని, దౌత్య యత్నాలు విఫలమైతే తక్షణమే సైనిక చర్య చేపడతామని నిన్నటి వరకూ చెబుతూ వచ్చిన ట్రంప్ గడువు ముగుస్తున్న వేళ మాట మార్చారు. 'ఇరాన్ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతిన్నదన్న వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకొని...పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్ అశిం మునీర్, ప్రధాని షెహ్బాజ్ షరీఫ్ అభ్యర్థన మేరకు మేము దాడుల నిర్ణయాన్ని పక్కన పెట్టాం' అని ఆయన ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. 2



# భవిష్యత్ ఇంధనం గ్రీన్ హైడ్రోజన్ !

- పారిశ్రామిక ఆధిపత్యం కోసం చైనా
- సబ్సిడీలిచ్చి డిమాండ్ పెంచుతున్న భారత్

న్యూఢిల్లీ, బీజింగ్ ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఇక భవిష్యత్ ఇంధనంగా రూపొందనున్న హరిత హైడ్రోజన్ రంగంపై పట్టు సాధించేందుకు చైనా, భారత్‌లు చాలా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. పెద్ద ఎత్తున గ్రీన్ హైడ్రోజన్ (పునర్వినియోగ ఇంధనాన్ని ఉపయోగించడం -మిగతా 2 లో



# రాహుల్‌గాంధీపై పరువునష్టం కేసు తీర్పు రిజర్వ్



2

# కాళేశ్వరం కథ ముగియలేదు

## సిబిఐ విచారణకు తీర్పు అడ్డంకి కాదు

- బిఆర్ఎస్ నేతల సంబరాలు ఎందుకో
- మండిపడ్డ పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్,ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కాళేశ్వరంపై తెలంగాణ హైకోర్టు క్లీన్ చిట్ ఇవ్వలేదని.. బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదన్నారు. హైకోర్టు తీర్పును పూర్తిగా అధ్యయనం చేశాక భవిష్యత్తు -మిగతా 2 లో



# ప్రభుత్వానికి చెంపపెట్టు

## అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, ముమ్మాటికీ పీసీసీ నివేదిక



- కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెళ్లుమనించే విధంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది
- రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పనిచేయండి
- హైకోర్టు తీర్పుపై మీడియాతో కెటిఆర్

హైదరాబాద్ ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కూలింది.. కాళేశ్వరం కాదని, కాంగ్రెస్ చేసిన కుట్రలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు అని కేటీఆర్ అన్నారు. -మిగతా 2 లో

# బ్రాండ్ ఆధారంగా ప్రాధాన్యత


- మూడు కేటగిరీలుగా విభజించండి
- పరిశ్రమల శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్న పరిశ్రమలు, సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలని సీఎం ఏ రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వాటిలో పేరున్న బ్రాండ్ సంస్థలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్న అన్ని సంస్థలనూ అధికారులు తప్పనిసరిగా పర్యవేక్షించాలనీ, వారితో తరచుగా మాట్లాడు తూ అనుమతులు, భూ కేటాయింపుల అంశాల్లో అవసరమైన ప్రతిపాదనలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి పంపాలని సూచించారు. బుధవారం సీఎం నివాసంలో పరిశ్రమలశాఖపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డితో పాటు పరిశ్రమల శాఖ ఉన్నతాధికా రులు పాల్గొన్నారు. -మిగతా 2 లో

# కేసీఆర్, హరీశ్ రావులకు ఊరట

- ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలొద్దు
- సీబీఐ దర్యాప్తు కూడా చేయొద్దు
- కాళేశ్వరంపై హైకోర్టు కీలక తీర్పు



హైదరాబాద్ ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కాళేశ్వరం ప్రాజెక్ట్ వ్యవహారంపై సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ నివేదిక చెల్లదని హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావుపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని తేల్చి చెప్పింది. అలాగే ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్, -మిగతా 2 లో

# నేపాల్‌లో మళ్లీ నిరసనలు..

మొదటి తరువాయి

సరిహద్దుల్లో ఉన్న ప్రజలు అత్యవసరాల కోసం భారత్‌పై ఆధారపడతారని చెప్పారు. మరోవైపు విద్యార్థి సంఘాలను పట్టించుకోకుండా వాటిపై నిషేధం విధించినందుకు విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ యూనిఫామ్‌లోని వేలాది మంది విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి నిరసన ప్రదర్శనల్లో పాల్గొనడం కొన్ని వీడియోల్లో కనిపించింది. నిరసనల తీవ్రత పెరుగుతుండటంతో బాలెన్ షా సర్కార్‌పై ఒత్తిడి పెరుగుతున్నది.ప్రజల అసంతృప్తి విస్తృత రాజకీయ సవాల్‌గా పరిణమించింది. ఇంకోవైపు దేశ హోం మంత్రి సుధన్ గురుంగ్ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని, అనుమానాస్పద లావాదేవీల్లో పాల్గొంటున్నారని ఆరోపణలు వచ్చాయి. మనీ లాండరింగ్‌కు పాల్పడిన ఓ వ్యాపారి కంపెనీల్లో ఆయనకు షేర్లు ఉన్నాయని తెలియడంతోనే ఆయన రాజీనామాకు సొంత పార్టీ నుంచే డిమాండ్ వచ్చింది. ఈ నేపథ్యంలో తనపై వచ్చిన ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిగేందు కోసం తాను రాజీనామా చేసినట్టు బుధవారం ఫేస్‌బుక్ పోస్ట్‌లో గురుంగ్ తెలిపారు. ఆర్థిక శాఖ ఈ ఆరోపణలపై విచారణ చేస్తుందని చెప్పారు. అధికారం స్వీకరించిన వెంటనే ఉన్నతాధికారులు, మాజీ ప్రధానుల అరెస్టుతో వార్తల్లో నిలిచిన ఆయనపై కొన్ని వారాలకే అవినీతి, ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలు రావడం గమనార్హం.

# లక్నోను చిత్తు చేసిన రాయల్స్..

మొదటి తరువాయి

ఎంచుకున్న లక్నో.. ఈ ప్రదర్శనతో సంతృప్తి చెందే ఉంటుంది. కానీ బ్యాటింగ్‌లో ఆ జట్టు తేలిపోయింది. బ్యాటర్ల వైఫల్యం కొనసాగిస్తూ.. ఆ జట్టు 119 పరుగులకే కుప్పకూలింది.160 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నోకు ఆదిలోనే షాక్ తగిలింది. తొలి ఓవర్‌లోనే ఆయుష్ బదోనీ (0) డకౌట్ అయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్ (0), ఎయిడెన్ మార్క్రమ్ (0).. బదోనీని ఫాలో అయ్యారు. పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరిపోయారు. దీంతో స్వల్ప లక్ష్య ఛేదనలోనూ లక్నో ఒత్తిడికి గురైంది. ఓ పక్క వికెట్లు పడుతున్నా మిచెల్ మార్ష్ (55) పోరాడటంతో లక్నో పోటీలోనే ఉంది. కానీ అతడు ఔట్ అయ్యాక పరిస్థితి మారిపోయింది. పరుగులు చేసేందుకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న నికోలస్ పూరన్ (25 బంతుల్లో 22 రన్స్) ఈ మ్యాచ్‌లోనూ పెద్దగా రన్స్ చేయలేకపోయాడు. లక్నో బ్యాటర్లలో కేవలం ముగ్గురు మాత్రమే రెండంకెల స్కోరు చేయడం గమనార్హం.రాజస్థాన్ బౌలర్ల దెబ్బకు లక్నో సూపర్ జెయింట్స్.. 18 ఓవర్లలో 119 పరుగులకు కుప్పకూలింది. జోఫ్రా ఆర్చర్ 3, నండ్రే బర్గర్ 2, బ్రిజేష్ శర్మ 2 వికెట్లు తీశారు. రవీంద్ర జడేజా, రవి బిష్ణోయ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. కాగా ఈ ఫలితంతో లక్నోలో లక్నో సూపర్ జెయింట్స్ వరుసగా ఏడో మ్యాచులోనూ ఓడిపోయింది. ఈ విజయంతో రాజస్థాన్ పాయింట్స్ టేబుల్‌లో రెండో ప్లేసుకు దూసుకెళ్లింది. లక్నో 9వ ప్లేసుకు పడిపోయింది.

# నేడు రెండు రాష్ట్రాల్లో పోలింగ్

మొదటి తరువాయి

6 గంటల వరకు కొనసాగుతుంది. మే 4న తుది ఫలితాలు వెలువడనున్నాయి.

తమిళనాడు రెడీ

అసెంబ్లీ పోరుకు తమిళనాడు సిద్ధమైంది. మొత్తం 234 స్థానాలకు గానూ వివిధ పార్టీల నుంచి 4,023 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. మొత్తం 5.73 కోట్ల మందికి పైగా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 2.93 కోట్ల మందికి పైగా మహిళా ఓటర్లు, 2.77 కోట్ల మందికి పైగా పురుష ఓటర్లు ఉన్నారు. మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటంతో వారి ఓట్లు కీలకం కానున్నాయి. ట్రాన్స్‌జెండర్లు 7728 మంది ఉన్నారు. మొత్తం 33,133 ప్రాంతాల్లో 75 వేలకు పైగా పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 3,60,068 మంది పోలింగ్ సిబ్బంది ఎన్నికల విధులను నిర్వర్తించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే విడతలో పోలింగ్ జరగనుండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. మొత్తం 1.40 లక్షల మంది పోలీసులు ఎన్నికల విధుల్లో ఉన్నారు. పోలింగ్ డే కావడంతో నేడు తమిళ నాడుకు పబ్లిక్ హాలిడే ప్రకటించింది ఎన్నికల సంఘం.

బెంగాల్ దంగల్

పశ్చిమబెంగాల్ మొదటి విడత ఎన్నికలకు సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా 16 జిల్లాల్లోని 152 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ సారి ఓటర్లు ఎన్నికల పండుగలో ఎక్కువ సంఖ్యలో పాల్గొనే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 3.60 కోట్ల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1.84 కోట్ల మందికి పైగా పురుష ఓటర్లు కాగా.. 1.75 కోట్ల మందికి పైగా మహిళా ఓటర్లు ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లు 465 మంది ఉన్నారు. .. బెంగాల్‌లో ఎన్నికల కోసం ఈసీ భారీ ఏర్పాట్లను చేసింది. దాదాపు 2.5 లక్షల మంది సిబ్బందితో పాటు రికార్డు స్థాయిలో 2,450 కంపెనీల కేంద్ర పారామిలిటరీ బలగాలను మోహరించింది. ఏఐ సహాయంతో 152 నియోజకవర్గాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ను అమలు చేస్తోంది.

# తెరుచుకున్న కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు

**న్యూఢిల్లీ,**



బుధవారం కేదార్‌నాథ్ ఆలయం ద్వారాలు తెరుచుకున్నాయి. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి దంపతులు ఆలయంలో మొదటి పూజలో పాల్గొనగా, హరహర మహాదేవ్, జై శ్రీ కేదార్.. అంటూ భక్తుల నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ వేడుకను వీక్షించడానికి వేలాది మంది భక్తులు కేదార్‌నాథ్ ఆలయానికి చేరుకోగా, ఆలయ ద్వారాలను భక్తుల కోసం లాంఛనంగా తెరిచారు.సీఎం ధామి, ఇతర అధికారులు యాత్రా ఏర్పాట్లను సమీక్షించారు. తొలి విడతలో వచ్చిన భక్తులు ఐదు నిమిషాల్లో తమ ప్రార్థనలు పూర్తిచేసుకున్నారని, పుణ్యక్షేత్ర ప్రాంగణాన్ని ప్లాస్టిక్ రహితంగా ఉంచటం ద్వారా 'హరిత యాత్ర'కు మద్దతు ఇవ్వాలని సీఎం ధామి యాత్రికులను కోరారు. బద్రినాథ్ ఆలయ ద్వారాలు గురువారం తెరుచుకోన్నాయి

# రాహుల్‌గాంధీపై పరువునష్టం కేసు తీర్పు రిజర్వ్

**సుల్తాన్‌పూర్**

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై పరువునష్టం కేసులో తీర్పును మే 2వ తేదీకి తీర్పును స్థానిక ఎంపి, ఎమ్మెల్యేల కోర్టు రిజర్వ్ చేసింది. స్థానిక బీజేపీ నాయకుడు విజయ్ మిశ్రా ఫిర్యాదు మేరకు 2018 అక్టోబర్‌లో ఈ పరువునష్టం కేసు నమోదయింది. అప్పటి బీజేపీ అధ్యక్షులు, ప్రస్తుత కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై రాహుల్‌గాంధీ అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారనే ఫిర్యాదుతో ఈ కేసు నమోదయింది. ఈ కేసులో 2024 ఫిబ్రవరి 20న కోర్టు ఎదుట రాహుల్‌గాంధీ లొంగిపోయారు. దీంతో కోర్టు రూ. 25 వేల చొప్పున రెండు పూచీకత్తులపై రాహుల్ గాంధీకి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వ్‌లో ఉంచింది.

# బ్రాండ్ ఆధారంగా ప్రాధాన్యత

మొదటి తరువాయి

ఈ సందర్భంగా అధికారులు రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిపై సీఎం రేవంత్‌రెడ్డికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. వివిధ వేదికలపై ప్రభుత్వంతోఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థలు తమ కార్యకలాపాలు మొదలు పెట్టేలా చూడాలని సీఎం ఆదేశించారు. దానికి అవసరమైన అన్ని రకాల సదుపాయాలను కల్పించాలని దిశానిర్దేశం చేశారు. పెట్టుబడులకు సంబంధించి దావోస్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో జరిగిన పారిశ్రామిక ఒప్పందాలు, వాటి పురోగతిపై చర్చించారు.

# ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్

మొదటి తరువాయి

కార్మికుల సమ్మెతో పెద్దపల్లిలో 150 బస్సులు డిపోనకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో 112 బస్సులు డిపోనకే పరిమితం కాగా.. ప్రయాణికుల కోసం 16 విద్యుత్ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ అద్దె బస్సులను నడుపుతోంది. కండక్టర్ లేకుండా వీటిని తిప్పుతోంది. మరోవైపు బస్సులు లేక పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే బస్సులను డిపోలకు పరిమితం చేశారు. రహదారులపై బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి బస్సులన్నీ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరంలో దాదాపు రోజుకు 25 లక్షల మంది ప్రజా రవాణాను వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా వారు అధిక ఛార్జీలను వసూలు చేస్తున్నారు.కరీంనగర్‌లో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రైవేటు డ్రైవర్‌తో నడిపిస్తున్న అద్దె బస్సు లారీని ఢీకొట్టింది. కరీంనగర్‌లోకి కోతిరాంపూర్ బైపాస్ వద్ద



బస్సు అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. కాగా, శిక్షణ లేని డ్రైవర్లతో బస్సులు నడిపిస్తుండటం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీజీఎస్ ఆర్టీసీ కార్మికుల సమ్మెతో హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైళ్ల సంఖ్య, ఫ్రీక్వెన్సీ పెంచాలని నిర్ణయించారు. ఆర్టీసీ సమ్మె ముగిసేవరకూ 56 మెట్రో రైళ్లను నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. మియాపూర్- ఎల్.బి.నగర్ కారిడార్‌లో 4 నిమిషాల 20 సెకన్ల విరామంతో, అలాగే నాగోల్-రాయదుర్గం కారిడార్‌లో 3 నిమిషాల 40 సెకన్ల విరామంతో రోజంతా గరిష్ఠంగా 56 రైళ్లను నడపనున్నట్లు తెలిపారు. చివరి మెట్రో రైలు సర్వీస్ రాత్రి 11 గంటల తర్వాత కూడా పొడిగించేలా చర్యలు చేపట్టినట్లు మెట్రో అధికారులు పేర్కొన్నారు. అయితే, కార్మికుల సమ్మెతో నగరవాసులు మెట్రో రైళ్లపై ఆధారపడాల్సి వచ్చింది. ఉదయం నుంచి రైళ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు తండోపతండాలుగా మెట్రోస్టేషన్లకు తరలివస్తున్నారు. పెరిగిన ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 56 మెట్రో రైళ్లను నడపాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు కార్మికుల సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కొన్ని సంఘాలు నిజాలను విస్మరించి కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ జేఏసీ సమ్మె బాట పట్టింది. మంగళవారం నాడు అధికారులతో చర్చలు విఫలం కావడంతో ఆందోళనకు దిగారు ఆర్టీసీ కార్మికులు. బస్సులను డిపోలకే పరిమితం చేసి రోడ్లపై బైఠాయించి నిరసనలకు దిగారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని తేల్చి చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సమ్మె విరమించాలని కార్మికులను కోరుతోంది. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా బస్సులు నడపాలని సంబంధిత ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కాల్పుల విరమణ పొడిగింపు

**న్యూఢిల్లీ,**

పశ్చిమాసియా సీజ్‌ఫైర్ విష యంలో మరో కీలక పరిణామం చోటు చేసుకున్నది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణ మరో సారి పొడిగించారు. సైనిక చర్యను జాప్యం చేయాలని, దౌత్యానికి సమయం ఇవ్వాలని పాకిస్తాన్ కోరిందని, ఆ మేరకు నిర్ణయం తీసుకున్నామని ట్రంప్ తెలిపారు. అయితే ఇరాన్ ఓడరేవుల దిగ్బంధం కొనసాగుతుందని, తమ సైన్యం అప్రమత్తంగా సిద్ధంగా ఉంటుందని చెప్పారు. కాగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించిన ట్రంప్‌కు పాక్ ప్రధాని షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం దౌత్య యత్నాల కొనసాగింపుకు అవకాశం కల్పిస్తుందని చెప్పారు. చర్చల ద్వారా పరిష్కారం కనుగొనేందుకు పాకిస్తాన్ ప్రయత్నాలు కొనసాగిస్తుందని చెబుతూ ఇరు పక్షాలు కాల్పుల విరమణను గౌరవించి, తదుపరి విడత చర్చలలో సమగ్ర శాంతి ఒప్పందం దిశగా కృషి చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఒప్పందం పొడిగింపు వెనుక...



ట్రంప్ మంగళవారం మధ్యాహ్నం శ్వేతసౌధంలో తన జాతీయ భద్రతా బృందంతో సమావేశమయ్యారు. ఇరాన్ విషయంలో ఏం చేయాలన్న దానిపై వారితో చర్చించారు. ఎందుకంటే ఇరాన్‌తో రెండు వారాల కాలానికి కుదుర్చుకున్న కాల్పుల విరమణ ఒప్పందం గడువు సమీపిస్తుండడంతో ఏదో ఓ నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇరాన్‌తో రెండో విడత చర్చల కోసం ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పాకిస్తాన్ బయలుదేరడానికి ముందు జాయింట్ బేస్ ఆండ్రూస్‌లోని రన్‌వేపై ఎయిర్ ఫోర్స్ టు విమానం సిద్ధంగా ఉంది. కానీ చర్చల విషయంలో ఇరాన్ నుంచి ఎలాంటి సానుకూలత వ్యక్తం కాక పోవడంతో అమెరికాకు ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితి ఎదు రైంది. చర్చల సందర్భంగా ఇరాన్ అంగీకరించాల్సిన జాబితాను అమెరికా అంతకుముందే పంపింది. కానీ టెహ్రాన్ నుంచి ఎలాంటి సమాధానం లేదు. దీంతో చర్చల కోసం పాకిస్తాన్ వెళ్లినా సాధించే దేముంటుందన్న అనుమానం వ్యక్తమైంది.

శ్వేత సౌధంలో ట్రంప్, వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రుబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్ సేథ్, జాయింట్ చీఫ్స్ చైర్మెన్ డాన్ కెయిన్, సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ సమావేశమై ఇరాన్ స్పందన కోసం వేచి చూశారు. వాన్స్ బృందం ఎయిర్ ఫోర్స్ టు విమానం ఎక్కే లోపు ఇరాన్ నుంచి ఏదో ఒక స్పందనను రాబట్టాల్సిందిగా అమెరికా అధికారులు పాక్ సైన్యాధ్యక్షుడు అశిం మునీర్‌ను కోరారు. అయినప్పటికీ ఫలితం శూన్యం.

# కాళేశ్వరం కథ ముగియలేదు

మొదటి తరువాయి

కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. పలువురికి నోటీసులు ఇవ్వలేదని మాత్రమే హైకోర్టు చెప్పిందని వివరించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను హైకోర్టు తప్పుబట్టలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ కమిషన్ విచారణ చేసి ఇచ్చిన నివేదికను కూడా హైకోర్టు తప్పుపట్టలేదన్నారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన ప్రాజెక్ట్ కూలిపోయిందని.. లక్ష కోట్లు వృథా చేశారని టీపీసీసీ చీఫ్ మండిపడ్డారు. కమీషన్ల కక్కుర్తి వల్లే కాళేశ్వరం కూలిందని ఆరోపించారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని, ఏటీఎంలా మారిందని అమిత్ షా, నడ్డా చేసిన వ్యాఖ్యలు వాస్తవం కాదా కిషన్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టు చెప్పిన కొన్ని అంశాలను చూసి సంబరాలు చేసుకుంటున్నారని బీఆర్ఎస్‌పై మహేశ్ గౌడ్ మండిపడ్డారు. పీసీ గోష్ రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న ఎన్‌డీఎస్‌ఏ కూడా రిపోర్ట్ ఇచ్చిందన్నారు. కాళేశ్వరంలో నిర్మాణ లోపాలు ఉన్నాయని ఎన్‌డీఎస్‌ఏ చెప్పిందని తెలిపారు. హైకోర్టు ఎక్కడా కూడా బీఆర్ఎస్ అవినీతికి పాల్పడలేదని చెప్పలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్ట్ వారి హయాంలోనే కూలిందన్నారు. ఆలస్యమైనా దోషులు జైలుకు వెళ్లక తప్పదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# ప్రభుత్వానికి చెంపపెట్టు

మొదటి తరువాయి

ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పని చేయాలని హితవు పలికారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, ముమ్మాటికీ పీసీసీ నివేదిక అని మేము ముందు నుంచి చెబుతుంది ఇవాళ అక్షరాల నిజమని తేలిపోయిందన్నారు.. కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెళ్లుమనించే విధంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఇవాళ గెలిచింది.. తెలంగాణ ప్రజలు, రైతులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కృషి చేసిన ఇంజినీర్లు. మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసింది. ఇవాళ తెలంగాణలో పారుతున్న ప్రతినీటి బొట్టు కేసీఆర్ కృషే. భూమిపై గోదావరి పారినన్ని రోజులూ కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరిపివేయలేరు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, పీసీసీ నివేదిక అని నేను అప్పుడే చెప్పాను. హైకోర్టు తీర్పుతో అందరికీ ఇవాళ జ్ఞానోదయం కలిగి ఉంటుంది. కాళేశ్వరం కచ్చితంగా తెలంగాణకు వరప్రదాయని. రూ.94వేల కోట్లు ఖర్చు అయితే.. రూ.లక్ష కోట్లు అని దుష్ప్రచారం చేశారు. కాళేశ్వరం అంటే ఒక్క బ్యారేజీ కాదు.. మూడు బ్యారేజీలు. మేడిగడ్డపై చేసిన ఖర్చు రూ.3,800 కోట్లు మాత్రమే. కాంగ్రెస్ కుట్రల వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని మరోసారి చెబుతున్నా. రాష్ట్రంలో చెక్‌డ్యామ్‌లను బాంబులు పెట్టి పేలుస్తున్నారు. ఈ విషయంలో కేంద్రం ఏం చేస్తోంది? మేడిగడ్డలో ఏం జరిగిందో విశ్రాంత జడ్జితో మళ్లీ విచారణ జరిపించాలని కేటీఆర్ అన్నారు.తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టు తీర్పు ఒక గట్టి 'చెంపపెట్టు' అని కేటీఆర్ అభివర్ణించారు. భారత రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా దేశంలోని గౌరవ న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైందని కేటీఆర్ పేర్కొన్నారు. ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలకు బ్రేక్ పడినట్లయిందని కేటీఆర్ స్పష్టం చేశారు. కమిషన్ విచారణలో సహజ న్యాయ సూత్రాలను పూర్తిగా విస్మరించడమే కాకుండా, నిబంధనలకు పాతరేశారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గతంలోనే స్పష్టం చేశారని, ఆ విషయాలతో ఇవాళ హైకోర్టు కూడా ఏకీభవించడం హర్షణీయమని ఆయన తెలిపారు.

# భవిష్యత్ ఇంధనం గ్రీన్ హైడ్రోజన్ !

మొదటి తరువాయి

ద్వారా నీటి ఎలక్ట్రాలసిస్ ద్వారా ఉత్పత్తయ్యే హైడ్రోజన్) ఉత్పత్తి సామర్థ్యాన్ని నిర్మించుకునేందుకు ఇరు దేశాలు పెద్ద మొత్తంలో నిధులను ఖర్చు చేస్తున్నాయి. అయితే పారిశ్రామిక ఆధిపత్యాన్ని నిలుపుకోవడంపై చైనా దృష్టి కేంద్రీకరించగా, భారత్ ఇంధన భద్రతకు పెద్ద పీట వేస్తోంది. సబ్సిడీలు ఇచ్చి దేశీయంగా డిమాండ్‌ను పెంచడంపై దృష్టి పెట్టింది. పశ్చిమ దేశాల్లో ఈ రంగంలో కొంత స్తబ్ధత నెలకొన్న నేపథ్యంలో ఇరు దేశాలు ఈ రంగంలో తమ మార్కెట్‌ను పెంచుకోవడానికి చూస్తున్నాయి. ఇందుకు అవసరమైన రాజకీయ సంకల్పం, ఆర్థిక తోడ్పాటు సమకూర్చుకుంటున్నాయి.

వాతావరణ కాలుష్యానికి ఇతోధికంగా దోహదపడుతున్న బొగ్గుకు దూరంగా వెళ్లాలని చైనా ప్రయత్నిస్తోంది. ఇందుకోసం 200కోట్ల డాలర్ల ప్రాజెక్టులో భాగమైంది.

భారత్ దాదాపుగా 210కోట్ల డాలర్ల విలువ చేసే సబ్సిడీల తోడ్పాటుతో 2030కల్లా ఏటా 50లక్షల మెట్రిక్ టన్నుల హరిత హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ప్రస్తుత గ్లోబల్ మార్కెట్‌కు ఐదు రెట్లు ఎక్కువగా వుంది. అప్పటికి చైనా ఉత్పత్తికి దాదాపుగా రెట్టింపని అంచనా వేస్తున్నారు.

# కేసీఆర్, హరీశ్ రావులకు ఊరట

మొదటి తరువాయి

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్‌కే జోషి వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలను కలిపి ఉమ్మడిగా తీర్పు వెలువరించింది. పిటిషనర్లపై కమిషన్ నివేదిక ఆధారంగా సీబీఐ దర్యాప్తుతో పాటు ఇతర చర్యలేవీ తీసుకోరాదని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చట్టబద్ధంగానే ఉన్నప్పటికీ, ఆ కమిషన్ విచారణ తీరు చట్టబద్ధంగా లేదని తేల్చింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళ్తే...పిటిషనర్లు కేసీఆర్, హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్‌కే జోషిలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గత ఏడాది జులై 31న ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దర్యాప్తు చేయరాదని హైకోర్టు గతేడాది సెప్టెంబర్ 2న మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. బుధవారం వెలువడిన తీర్పు ప్రకారం మధ్యంతర ఉత్తర్వులు తుది ఉత్తర్వుల య్యాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు గురైందని చెప్పి ప్రభుత్వం జస్టిస్ ఘోష్ కమిషన్‌తో విచారణకు ఆదేశించడం చట్టబద్ధమేనని స్పష్టం చేసింది. కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్ ప్రకారం ప్రభుత్వానికి విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం ఉందని వెల్లడించింది. ఈ క్రమంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిజనిర్ధారణ మాత్రమే చేయాలనీ, ఎవరు తప్పు చేశారో చెబుతూ వాళ్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలనే ధోరణిలో నివేదిక ఇవ్వడాన్ని ఆక్షేపించింది. కమిషన్ విచారణ సమయంలో సాక్షులు ఇచ్చిన సమాచారాన్ని, ఆధారాలను పరిశీలించాక ఎవరిపైన అయినా అభియోగాలు ఉన్నాయని భావిస్తే.. సదరు సాక్షికి ఆ వివరాలు, అభియోగాలు తెలియజేసి వివరణ తీసుకోవాలన్న కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్‌లోని సెక్షన్ 8(బి), 8(సి) సెక్షన్ల నిబంధనలను అమలు చేయలేదని తప్పుపట్టింది. వరుసగా సాక్షుల వివరాలు తీసుకుని వాటిని పరిగణనలోకి తీసుకుంటూ తుది నివేదిక ఇవ్వడం చట్ట వ్యతిరేకమని స్పష్టం చేసింది. ఒక వ్యక్తి లేదా సాక్షి ఒకరిపై చేసిన ఆరోపణలను అతనికి అందజేసి వివరణ తీసుకోవాలని ఆ రెండు సెక్షన్లు స్పష్టం చేస్తున్నాయని తెలిపింది. ఇక్కడ పిటిషన్లకు జస్టిస్ ఘోష్ కమిషన్ అలాంటి అవకాశం ఇవ్వలేదని విచారణలో తేల్చింది.

# మైనారిటీ గురుకుల విద్యార్థుల అద్భుత ఫలితాలు



**పెద్దపల్లి, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇంటర్మీడియట్ ఫలితాల్లో మైనారిటీ గురుకుల విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచినందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందించారు.జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి పి. నరేష్ కుమార్ నాయుడు విద్యార్థులతో కలిసి కలెక్టర్‌ను కలసి ఫలితాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన ఫలితాలు జిల్లాకు గర్వకారణమని, భవిష్యత్తులో పోటీ పరీక్షలపై దృష్టి సారించాలని సూచించారు.చంద్ర వైష్ణవి 491/500 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్, లక్ష్మీ ప్రసన్న 981/1000 మార్కులతో టీజీఎంఆర్ఈఎస్లో 2వ స్థానం, నిదా కౌనిన్ 990/1000 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంక్, మనోగ్న 436/440 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్ సాధించారు. విద్యార్థుల క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత స్థానాలు సాధించవచ్చని కలెక్టర్ ప్రోత్సాహం ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు




**గన్నేరువరం, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
తిమ్మాపూర్ మండలం నేదునూర్ గ్రామం నుండి పీచుపల్లి గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా రాత్రిపూట ఇసుక రవాణా చేస్తుండగా ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.డ్రైవర్ కోహెడ రాజు, యజమాని మంద శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు.

## కోతుల బెడదతో భయాందోళనలో ప్రజలు



**కరీంనగర్, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పట్టణంలోని పలు డివిజన్లలో కోతుల సమస్య తీవ్రరూపం దాల్చి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. చిన్న పిల్లలపై, గృహిణులపై, పాదచారులపై దాడులు చేస్తూ ఇళ్లలోకి ప్రవేశించడం వల్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశాల్లో స్థానికులు ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కోతులను పట్టే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, వాటిని జనావాసాలు లేని ప్రాంతాల్లో విడిచిపెట్టాలని తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

## బతుకమ్మ ఆటతో ఆర్టీసీ కార్మికుల నిరసన



**ఉప్పల్, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కుషాయిగూడ బస్ డిపోలో మహిళా కార్మికులు ప్రత్యేకంగా బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని వారు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లపై నినాదాలు చేస్తూ సంఘీభావం వ్యక్తం చేశారు.

# షాద్‌నగర్ డిపోలో నిలిచిపోయిన బస్సులు



**షాద్‌నగర్, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రవ్యాప్త ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె పిలుపులో భాగంగా షాద్‌నగర్ బస్ డిపోలో రవాణా వ్యవస్థ స్తంభించింది. కార్మికులు విధులు బహిష్కరించడంతో బస్సులు డిపోకే పరిమితమయ్యాయి.ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు, ఉద్యోగులు, విద్యార్థులు గమ్యస్థానాలకు చేరుకోలేక బస్టాండ్‌లోనే నిలిచిపోయారు. ప్రైవేట్ వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.ఆర్టీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ, “గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను వెంటనే చెల్లించాలి. సంక్షేమ చర్యలు చేపట్టాలి. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె కొనసాగుతుంది” అని హెచ్చరించారు.

# వెల్జాల్‌లో రాగి అంబలి పంపిణీ




**తలకొండపల్లి, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్జాల్ గ్రామ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద వెంకటాపూర్ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఏ. సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో బాటసారులకు రాగి అంబలి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన కుమారుడు శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ, వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసిన టి. రాఘవేందర్ గౌడ్కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలకు చల్లటి నీరు, మజ్జిగ, అంబలి అందుబాటులో ఉండటం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి. రమేష్ యాదవ్, మాజీ ఉపసర్పంచ్ బి. నర్సింలు, అజీజ్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎం. ఆరీఫ్, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజలకు మంచి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం



**మాడ్గుల, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మాడ్గుల మండలంలో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన, ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవాలు జరిగాయి.ఆర్కపల్లి--పల్గుతాండ రహదారి నిర్మాణానికి రూ. 1.05 కోట్లు వ్యయంతో బిటి, సిసి రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి. అనంతరం కొత్త బ్రాహ్మణపల్లి, పాత బ్రాహ్మణపల్లి, మాడ్గులలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు.మధ్యాహ్నం 12 గంటలకు వాసవీ ఫంక్షన్ హాల్‌లో 214 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు కిషన్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కొండల్ రెడ్డి, జగన్ గౌడ్, యాట గీత, నర్సింహ, రమేష్ గౌడ్, దళపతి, నరేంద్ర రెడ్డి, ఓం ప్రకాష్ రెడ్డి, బాబా, వేణుగోపాల్ రెడ్డి తదితరులు హాజరై విజయవంతం చేశారు.

# హైకోర్టు తీర్పుపై ఉప్పల వెంకటేష్ హర్షం



**తలకొండపల్లి, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదికను నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు.ఆయన మాట్లాడుతూ, “కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణను సస్యశ్యామలం చేసింది. కాంగ్రెస్, బీజేపీలు రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేసి కేసీఆర్ ప్రతిష్ట దెబ్బతీయాలని చూశాయి. కానీ న్యాయస్థానాలపై నమ్మకంతో పోరాడిన కేసీఆర్, హరీష్ రావు చివరకు నిజం గెలిపించారు” అన్నారు.ఇకనైనా కాంగ్రెస్ పార్టీ రాజకీయ కక్ష్యలు మానుకుని పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. కోర్టు తీర్పుతో ప్రతిపక్షాలకు కనువిప్పు కలగాలని ఆకాంక్షించారు.

# అధిక ఎరువుల వాడకం పంటలకు నష్టం



**పాలకుర్తి, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పంటలకు అధిక ఎరువులు వాడడం లాభం కాదని, నష్టమే కలిగిస్తుందని కేవికే రామగిరిఖిల్లా శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఎరువులను సమతుల్యంగా వాడితే ఖర్చు తగ్గడమే కాకుండా ఆహారం విషతుల్యం కాకుండా ఉంటుందని అధికారులు తెలిపారు. మట్టి ఆరోగ్యం ప్రాముఖ్యత, భూసార పరీక్ష అవసరం, యూరియా వినియోగాన్ని తగ్గించేందుకు పచ్చిరొట్ట పంటలను భూమిలో తొక్కివేయడం, జీవ ఎరువుల వినియోగం పెంపు, నానో ఎరువుల వినియోగం వంటి అంశాలను వివరించారు.రైతులు మట్టి నమూనాలు తీసుకొస్తే ఉచితంగా భూసార పరీక్షలు చేసి ఇస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాస్, రైతు కమిటీ చైర్మన్ దాడి నాగరాజు, వ్యవసాయ అధికారులు, కేవికే శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీఆర్ఎస్ మద్దతు



**హుస్నాబాద్, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ పట్టణంలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు బిఆర్ఎస్ పార్టీ మద్దతు ప్రకటించింది. కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వం చర్చలు జరపాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ఇప్పటికే 40 రోజుల క్రితమే సమ్మె నోటీసు ఇచ్చినా ప్రభుత్వం స్పందించలేదని వారు విమర్శించారు. కార్మికులు కొత్తగా డిమాండ్లు పెట్టలేదని, గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే కోరుతున్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆర్టీసీ సమస్యలను పరిష్కరించలేదని ఆరోపించారు. కార్మికులను బెదిరించడం సరికాదని, ప్రైవేట్ బస్సులను ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వ వైఖరి స్పష్టమవుతోందని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా వేలాది కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ జేఏసీతో చర్చలు జరపాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా, నియోజకవర్గ ప్రతినిధులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా అక్రిడేషన్ కమిటీలో జెఎస్ఎస్కు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్



**పెద్దపల్లి, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జర్నలిస్టుల సంక్షేమ సంఘానికి జిల్లా అక్రిడేషన్ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని జెఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు వెన్నంపల్లి శ్రీనివాస్ కలెక్టర్‌ను కోరారు.బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెఎస్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తోందని, అందుకుగాను కమిటీలో ప్రాతినిధ్యం అవసరమని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు బందల రాజశేఖర్ గత 20 సంవత్సరాలుగా వివిధ పత్రికల్లో పనిచేస్తున్నారని, ఆయనకు మీడియం పత్రికల తరఫున పెద్దపల్లి జిల్లా అక్రిడేషన్ కమిటీలో అవకాశం కల్పించాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వోడ్నాల తిరుపతి, జిల్లా ఇన్చార్జి కన్నూరి రాజు, బందల రాజశేఖర్, వోడ్నాల లత తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో ఉన్న నీటి ట్యాంకు తొలగింపు



**వెల్దండ, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ముందు శిథిలావస్థలో ఉన్న నీటి ట్యాంకును తొలగించాలని సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అభ్యర్థన మేరకు అధికారులు పరిశీలించారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన ట్యాంకు కూలిపోయే స్థితిలో ఉందని అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో పాత ట్యాంకును తొలగించి కొత్త ట్యాంకు నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బస్సమోని శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డి.ఇ. సంధ్యారాణి, ఏ.ఇ. లలిత, వార్డు సభ్యులు ఎస్. శేఖర్, బాదేపల్లి రమేష్, కార్యదర్శి గిరి, మంగళగిరి శ్రీను, సిబ్బంది రామకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మర్రిగూడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ



**మర్రిగూడ, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం జరిగింది. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ యశోద మాట్లాడుతూ, “మొదటి 1000 రోజులు శిశువు ఆరోగ్యానికి కీలకం. గర్భిణులు ఆకుకూరలు, మునగ, బొప్పాయి వంటి పోషకాహారం తీసుకోవాలి” అని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేశ్వరం రమేష్, కార్యదర్శి యూసుఫ్, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపిన తీన్మార్ మల్లన్న



**ఉప్పల్, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మద్దతు తెలిపారు. ఉప్పల్ డిపోలో కార్మికులతో సంఘీభావం వ్యక్తం చేసిన ఆయన మాట్లాడుతూ, “కార్మికులవి న్యాయమైన డిమాండ్లు. ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. సమస్యలు తీరే వరకు ఈ పోరాటం కొనసాగుతుంది” అని స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే చర్చలు జరిపి కార్మికుల డిమాండ్లను అమలు చేయాలని ఆయన కోరారు.

## ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మిద్దాం: కలెక్టర్ చంద్రశేఖర్




**నల్లగొండ, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అంతర్జాతీయ మాతృభూమి దినోత్సవం సందర్భంగా జిల్లా యువజన సర్వీసులు, క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ బి. చంద్రశేఖర్ కేంద్రీయ విద్యాలయం వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, “సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల ప్రకృతి పెను విపత్తు ఎదుర్కొంటోంది. అందరూ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి, ప్రకృతిని కాపాడాలి” అని పిలుపునిచ్చారు.

# మేడే ఉత్సవాలను జయప్రదం చేయండి

-ఏఐటీయూసీజిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు.




**దేవరకొండ ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** మేడే ఉత్సవాలను వాడవాడనా జరుపుకోవాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం నాడు డిండి సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ. అమెరికాలోని చికాగో నగరంలో 1886 మే 1న ప్రారంభమైన కార్మిక ఉద్యమం ప్రపంచ కార్మిక లోకానికి పూ స్ఫూర్తిదాయకం అన్నారు. మేడే పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కార్మిక సమస్యలు పరిష్కారం కోసం ఎనిమిది గంటల పని దినంకై ఎన్నో పోరాటాలు నిర్వహించి కార్మికుల పట్ల నిలిచినటువంటి ఏకైక కార్మిక సంఘం ఏఐటియుసి అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఐక్య పోరాటాలు నిర్వహించాలని కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలకు సరైన గుణపాఠం చెప్పవలసిన సమయం ఆసన్నమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానంతరం మేడే పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షులు భుష్పాక లింగమయ్య , భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎలిమినేటి దేవయ్య , మధ్యాహ్న భోజనం కార్మిక సంఘం మండల అధ్యక్షులు బల్మూరి లక్ష్మయ్య , వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల ప్రవీణ్, తిరుపతయ్య ,ఎల్లమ్మ ,తదిరులు పాల్గొన్నారు.

## మైనారిటీ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ చంద్రశేఖర్




**నల్లగొండ, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారోత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ రాంనగర్‌లోని మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థినులకు అందుతున్న వసతులను పరిశీలించి, చిన్నపాటి మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డైనింగ్ హాల్, స్టోర్ రూమ్, వంటగదిని పరిశీలించి పరిశుభ్రత పాటించాలని సూచించారు. వేసవి సెలవుల్లో ఎక్స్‌పైరీ సరుకులను తొలగించి, పాఠశాల పునఃప్రారంభానికి ముందు మైనర్, మేజర్ రిపేర్లు పూర్తి చేయాలని సూచించారు.

## అకాల వర్షంతో వరి పంట నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ .



**దేవరకొండ ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** అకాల వర్షంతో వరి పంట నష్ట పోయిన రైతులను ఆదుకోవాలి అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కొండమల్లెపల్లి మండలం చెన్నారం గ్రామంలో అకాల వర్షంతో వరి పంట ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... రైతులకు నష్ట పరిహారం అందించాలని ఆయన కోరారు. నష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ. 50 వేలు అందించాలని ఆయన కోరారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవడం జరిగింది అని ఆయన గుర్తు చేశారు. రైతులకు బిఆర్ ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు,రైతులు తదితరులు ఉన్నారు.

# తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

-సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపిన సిపిఐ ,ఏఐటీయూసీ.



**దేవరకొండ ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు దేవరకొండ పట్టణంలో ఆర్టీసీ డిపో వద్ద సిపిఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సంపూర్ణ మద్దతు, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు ఎండి మైనొద్దీన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మేనిఫెస్టోలో తెలంగాణ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, యూనియన్ లను పునరుద్ధరిస్తామని, వేతన సవరణ, అవుట్సోర్సింగ్ ,కాంటాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ,ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి నడిపిస్తామని, రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ తక్షణమే చెల్లిస్తామని ,పెంచిన పనిభారాలను తగ్గించాలని, వారు తెలియజేసిన డిమాండ్లు న్యాయమైనవి. కావున ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించి, విద్యార్థులకు, మరియు ప్రజలకు ఇబ్బందులు లేకుండా, ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలనీ కోరడం జరిగింది. తక్షణమే ఈ డిమాండ్లను ఆర్టీసీ యాజమాన్యం పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తూ కార్మికులకు అండగా ఉంటూ సమస్యలు సాధించేవరకు ఉద్యమాలు చేస్తామని ఉద్యమాల ద్వారానే సాధించుకుంటామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి వలమల్ల ఆంజనేయులు,సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు మొగిల్లా వెంగలయ్య,అలామోని మల్లయ్య, కందుకూరి శ్రీను,ఎండి వాహబ్,దోమల వెంకటయ్య,వి వీరయ్య, ఆర్టీసీ జేఏసీ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

# మట్కా బీటర్లు అరెస్ట్



**మంత్రాలయం ,ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** మంత్రాలయం మండల పరిధిలోని తుంగభద్ర గ్రామంలో మట్కా రాస్తున్న వ్యక్తులను మాధవరం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు తుంగభద్ర గ్రామంలోని కొత్త సచివాలయం దగ్గర మట్కా రాస్తున్న తుంగభద్ర గ్రామానికి చెందిన బోయ బసవ , ఉప్పరి నాగరాజు ,రాంపురం గ్రామానికి చెందిన రుద్రప్ప స్వామి మట్కా చీటీలు రాస్తుండా రాబడిన సమాచారం తో తన సిబ్బంది తో వెళ్ళి దాడి చేసి పట్టుకున్నమన్నారు. వారి దగ్గర నుండి రూ. 13,860/- నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా మట్కా రాసిన లేదా ఆడినా, క్రికెట్ బెట్టింగ్, లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ వీరేష్, కానిస్టేబుల్ వీరాంజనేయుల, భాస్కర్ ఉన్నారు.

# ధర్మమార్గంలో నడిస్తే ప్రశాంతత






**ఆమనగల్లు, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** సమాజంలో ప్రతి ఒక్కరూ ధర్మమార్గంలో నడిస్తే ప్రశాంతత చేకూరుతుందని సదుర్గ మహర్షి శ్రీ మలయాళ స్వామి వారు అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని సద్గురు శ్రీ నిత్యశుద్ధానంద స్వామి క్షేత్రము, శ్రీరామదూత ఆశ్రమములో ఆశ్రమ స్థాపకులు శ్రీశ్రీ శివానంద స్వామి వారు తురీయాశ్రమ సన్యాస దీక్షా స్వీకరణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ దీక్షా స్వీకరణ కార్యక్రమానికి సదుర్గ మహర్షి శ్రీ మలయాళ స్వామి వారు, దీక్షా ప్రదాత పూజ్య శ్రీశ్రీశ్రీ పరిపూర్ణానందగిరి స్వామి వారు, శ్రీశ్రీశ్రీ



నిత్యశుద్ధానందగిరి స్వామి వారు హాజరై మాట్లాడారు.. సత్యం, ధర్మం వంటి విలువలను ఆచరించడం దేశ ప్రగతికి అవసరమన్నారు. పంచపరివర్తనల ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలని సూచించారు. దేశంలో హిందూ సాంస్కృతి సాంప్రదాయాలను పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా ఆశ మాల ఆశ్రమాల పీఠాధిపతులు స్వామీజీలు పురోహితులు, మాత స్వాములు, దాతలు, తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పోషకాహారం, విద్య, ఆరోగ్యానికి నిలయాలు అంగన్‌వాడీ కేంద్రాలు'

**- సర్పంచ్ మౌనిక శివ**

**ఆమనగల్లు, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పోషకాహారం, విద్య, ఆరోగ్యం పట్ల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల శ్రమ వెలకట్టలేనిదని సర్పంచ్ మౌనిక శివ కొనియాడారు. బుధవారం మండల పరిధిలోని మంగళపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షము కార్యక్రమంలో భాగంగా గ్రాడ్యుయేషన్ డే మరియు అన్న ప్రసన్న కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ మౌనిక శివ, అంగన్వాడి సూపర్వైజర్ అనిత పాల్గొని మాట్లాడుతూ.. పోషకాహారం తల్లి, పిల్లలు తీసుకోవడం వల్ల




ఆరోగ్యకరమైన సమాజాన్ని మనం నెలకొల్పవచ్చు అన్నారు. అలాగే ప్రవేట్ శక్తులు విద్యను వ్యాపారం చేసే ఈ రోజుల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ టీచర్లు పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లకు తీసుకెళ్లి వారికి పోషకాహారం, విద్య, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ వారిని ఆరోగ్యకరమైన పిల్లలుగా తయారు చేస్తున్న వారి కృషి అమోఘమని వారు అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం, ఆరోగ్య సంబంధిత సదుపాయాలను గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం బాలామణి, వార్డ్ సభ్యులు విజయ, అంగన్వాడి టీచర్లు పద్మ, అనిత సహాయకురాలు వరమ్మ, కార్యదర్శి గాయత్రి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ మరియు ఆశా కార్యకర్తలు, తల్లులు, పిల్లలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల పార్థివ దేహాలకు పాపిశెట్టి రాము' నివాళి

**ఆమనగల్లు, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠయిపల్లికి చెందిన బెల్లంకొండ రవి, కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామానికి చెందిన ఈర్లపల్లి కాశయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్



పాపిశెట్టి రాము స్థానిక నాయకులతో కలిసి రవి, కాశయ్య పార్దివ దేహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. అధైర్య పడొద్దు అండగా ఉంటానని భరోసా కల్పించారు. తన వంతు సహాయంగా ఆయా కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట శ్రీను నాయక్ తదితరులు ఉన్నారు.

## పాఠశాల పునః ప్రారంభం.. సన్మానం

**ఆమనగల్లు, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అమనగల్లు మండలం ఆకుతోటపల్లి పరిధిలోని గౌరారంలో మూతపడిన



పాఠశాలను పునః ప్రారంభించి విద్యా సంవత్సరం పూర్తి చేసిన ఉపాధ్యాయులను బుధవారం గ్రామస్థులు సన్మానించారు. పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్న సర్పంచ్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలకు పూర్వ వైభవం తీసుకొచ్చి విద్యార్థులకు సరైన విద్యను అందిస్తున్న ఉపాధ్యా యులు, పాఠశాలకు జిల్లా స్థాయిలో గుర్తిపు తేవాలని కోరారు.

# నిర్మానుష్యంగా ఆమనగల్లు బస్టాండ్







**ఆమనగల్లు, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆర్టీసీ సమ్మె సెగతో ఆమనగల్లు బస్టాండ్ బుధవారం నిర్మానుష్యంగా మారింది. జేఏసీ పిలుపుతో బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమ్మె విషయం తెలియక తెల్లవారుజాము నుంచే బస్టాండ్ కు వచ్చిన జనం.. బస్సులు లేక దిక్కుతోచని స్థితిలో కనిపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరారు. ప్రయాణికులపై సమ్మె ఎఫెక్ట్ ఆర్టీసీ కార్మికులు సమ్మెతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు కార్యాలయాలు, వెళ్లడానికి ప్రైవేట్ వాహనాలు ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రైవేట్ వాహనాలు ఒక్కసారిగా ధరలు పెంచేశాయి. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు మరి ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ జోరు ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రయాణికులు గమ్య స్థానాలకు చేరలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సు సర్వీసులు లేకపోవడంతో ఆటోలు, క్రూజర్ వంటి ప్రైవేటు వాహనాల హడావుడి పెరిగింది. ప్రయాణికులు అధిక ధరలు చెల్లించి వీటిని ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని జనం కోరుతున్నారు.

# ప్రభుత్వం అందించే పోషక ఆహారాలను సద్వినియోగం చేసుకోవాలి




**కల్వకుర్తి, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన పోషక పక్వాడ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ, "ప్రభుత్వం అందించే పాలు, గుడ్లు, ఆకుకూరలు, చిరుధాన్యాలు వంటి పోషక ఆహారాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. చిన్నారుల ఆరోగ్యానికి ఇవి అత్యంత అవసరం" అని సూచించారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ మొహమ్మద్, వైస్ చైర్మన్ శానవాజ్ ఖాన్, కాంగ్రెస్ జిల్లా ప్రతినిధి చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్లు షేక్ ఏజాస్, కొల్లోజు రాజేష్ కుమార్, రామకృష్ణ, రమాకాంత్ రెడ్డి, కోడెల గణేష్, చిత్తరి శ్రీను, ఐసీడీఎస్ అధికారులు, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎంపీ మల్లు రవి




**వనపర్తి, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కలిసి ప్రారంభించారు.తరువాత చిట్యాల గ్రామంలో సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లు ప్రారంభించారు. మార్కెట్ యార్డ్‌ను సందర్శించి వేరుశెనగ మద్దతు ధరపై రైతులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తేమ శాతం సక్రమంగా పరిశీలించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.


# వెల్దండలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ




**వెల్దండ, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్ పోతేపల్లి గ్రామంలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి, పని ప్రదేశంలో త్రాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.గ్రామ సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్ అదనపు కలెక్టర్, ఎంపీడీవోలను శాలువాలతో సన్మానించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి, ఒక గది ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో ఉండటంపై ఆరా తీశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి గృహప్రవేశాలు నిర్వహించాలని సూచించారు.కార్యక్రమంలో ఎంపీడీవో ఈ. కృష్ణయ్య, ఎంపీఓ లక్ష్మణ్, ఏపీవో ఈశ్వర్ జీ, పంచాయతీ కార్యదర్శి రూప్‌సింగ్, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు, ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతులు రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**ఆమనగల్లు, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రైతులు ఈ నెల 30వ తేదీలోగా రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమనగల్లు ఏడీఏ శోభారాణి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. డివిజన్ పరిధిలోని 4 మండలాల రైతులు రిజిస్ట్రేషన్ చేసుకుని ఐడి పొందాలని



సూచించారు. రిజిస్ట్రేషన్తోనే వ్యవసాయ, ఉద్యానశాఖ అందించే అన్ని సబ్సిడీ పథకాలు, ధాన్యం విక్రయం, రైతు భరోసా, బీమా, యూరియా కొనుగోలు, సాధ్య మవుతుందని వివరించారు. అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

# ఎలిగేడ్‌లో 26న విరాట్ హిందూ సమ్మేళనం



**ఎలిగేడ్, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హిందువుల ఐక్యత, ధార్మిక శక్తిని నిలబెట్టేందుకు విరాట్ హిందూ సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వహణ సమితి ప్రకటించింది. బుధవారం మండల కేంద్రంలోని కోదండరామాలయంలో సమ్మేళన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, "ఏప్రిల్ 26న ఉదయం మధుర ఫంక్షన్ హాల్లో శోభాయాత్రతో ప్రారంభమై సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, ధర్మప్రబోధిత సాంస్కృతిక కార్యక్రమాలు, స్వామీజీ ప్రసంగాలు, వక్తల ఉపన్యాసాలతో సమ్మేళనం జరుగుతుంది" అని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల హనుమాన్ దీక్షాపరులు, ఆలయ నిర్వాహకులు, యువజన సంఘాలు, భజన బృందాలు, హిందూ సంఘాలు కుటుంబ సభ్యులతో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిర్వహణ సమితి సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నేడు కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక కమిషనర్ శంకర్ నాయక్




**ఆమనగల్, ఏప్రిల్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్ మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక నేడు ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ తెలిపారు. ఈ ఎన్నికకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తం 16 మంది సభ్యులు ఈ ఎన్నికలో పాల్గొననున్నారని, వీరిలో 15 మంది కౌన్సిలర్లు కాగా, ఒకరు ఎక్స్-అఫిషియో సభ్యుడు ఉంటారని వివరించారు. సమావేశం నిర్వహణకు అవసరమైన కోరం కనీసం సగం సభ్యులు, అంటే 8 మంది హాజరు కావడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఓటింగ్ విధానం ప్రకారం ప్రతి కేటగిరీలో ఒక్కో సభ్యునికి ఒక్క ఓటు మాత్రమే ఉంటుందని, అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థులను విజేతలుగా ప్రకటిస్తామని కమిషనర్ తెలిపారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని శంకర్ నాయక్ పేర్కొన్నారు.

# ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా చెట్ల ప్రాధాన్యతను చాటిన విద్యార్థులు



**మర్రిగూడ, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండలంలోని రాం రెడ్డి పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రపంచ ధరిత్రీ (భూమి) దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం జరిగింది. మనిషి చేత చెట్ల నరికివేత, కాలుష్యకర చర్యల వలన భూగోళం వేడెక్కుతున్న తరుణంలో చెట్ల ప్రాధాన్యతను చాటిచెప్పేందుకు విద్యార్థులు చిరు ప్రయత్నం చేశారు. పర్యావరణాన్ని కాపాడాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి గాలి కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. చెట్ల ద్వారా స్వచ్ఛమైన గాలి లభిస్తుందని విద్యార్థులు సందేశమిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ శారద, మర్రిగూడ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రూప్ సింగ్, ప్రధానోపాధ్యాయులు బాడిగ అంజయ్య, ఉపాధ్యాయులు లెంకలపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయురాలు రత్నకుమారి, విద్యార్థులు తనుశ్రీ, మైత్లీ, దీక్షిత, శివాణి, జికిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం పై హైకోర్టు తీర్పు ప్రభుత్వ కుట్రలకు చెంపదెబ్బ

## - రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి



**ఆమనగల్లు, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కాళేశ్వరం ప్రాజెక్టు పై కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని చేస్తున్న విష ప్రచారాన్ని, కుట్రలను హైకోర్టు తీర్పుతో ప్రకృతి ముఖాన కొట్టినట్లయిందని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు తీవ్రంగా ఖండించారు. ఈ తీర్పు కేవలం కేసీఆర్, హరీష్ రావులకు మాత్రమే కాదని, తెలంగాణ కోటి ఎకరాల మాగాణి కలను నిజం చేసిన రైతులకు దక్కిన గొప్ప విజయమని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన నాటి నుండి కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని పక్కన పెట్టి, కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యలకే ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా, కనీసం వివరణ కోరకుండానే నోటీసులు ఇవ్వడం, విచారణ పూర్తికాకముందే నివేదికను లీక్ చేయడం వంటి చర్యల ద్వారా గత ప్రభుత్వంపై బురద చల్లాలని చూశారని మండిపడ్డారు. నేటి హైకోర్టు తీర్పుతో ప్రభుత్వం తన కుట్రపూరిత వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల తెలంగాణలో ఎడారి లాంటి ప్రాంతాలు కూడా పచ్చని పొలాలుగా మారాయని అన్నారు. ఆ ప్రాజెక్టును నిర్వీర్యం చేయాలని చూస్తున్న వారికి న్యాయస్థానం సరైన గుణపాఠం చెప్పిందని ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్టులపై ఆరోపణలు మానుకుని, ఇప్పటికే సిద్ధంగా ఉన్న నీటిని రైతులకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సుదీర్ఘ వాదనల తర్వాత హైకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు ప్రజల నమ్మకాన్ని బలపరిచాయని, ధర్మమే గెలిచిందని, తెలంగాణ ప్రయోజనాల కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకులకు న్యాయం జరిగిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో జరిగిన ప్రాజెక్టుల నిర్మాణం పారదర్శకంగా జరిగిందని చెప్పడానికి ఈ తీర్పే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు.

# రాములపల్లిలో తాగునీటి సమస్యల పరిశీలన





తాగునీటి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో భాస్కరరావు సర్పంచ్ సిద్ధి తిరుపతి యాదవ్

## - సీసీ రోడ్డు పనుల ప్రారంభం

**ఎలిగేడు, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాములపల్లి గ్రామంలో తాగునీటి సమస్యలను ఎంపీడీవో బాస్కర్ రావు బుధవారం పరిశీలించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీటి సరఫరా సమస్యను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. సర్పంచ్ సిద్ధి తిరుపతి యాదవ్, పంచాయతీ కార్యదర్శి హరిబాబుతో మాట్లాడి గ్రామంలో తాగునీటి సమస్యలు, ఉపాధి హామీ పనులు, నర్సరీ నిర్వహణ, కూలీల వేతనాలు, పారిశుధ్య నిర్వహణ, స్ట్రీట్ల సంరక్షణ, పంచాయతీ రికార్డుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. తరువాత గ్రామంలో డీఎంఎఫ్ టీ పథకం కింద రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ తిరుపతి యాదవ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, "గ్రామంలోని అంతర్గత రహదారుల అభివృద్ధికి కృషి చేస్తాను" అని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ విద్యాలత విజయ్, వార్డు సభ్యులు తిరుపతి, శృతి సంపత్, కోట సందీప్, రాజ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న రాములపల్లె సర్పంచ్

# ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన పిడి శ్రీధర్



**హుస్నాబాద్ , ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో ప్రారంభించిన ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీఓ పీడీ శ్రీధర్ సందర్శించారు. రైతులకు నేరుగా లాభం చేకూరే విధంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రం గ్రామీణ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. రైతులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మధ్యవర్తుల జోక్యం లేకుండా పారదర్శకంగా సేవలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అలువాల శంకర్, ఉప సర్పంచ్, ఐకేపీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# మెప్మా సమక్షంలో మహిళా వ్యాపార వేత్తలకు, ఆర్‌పీలకు ఉద్యమ రిజిస్ట్రేషన్‌పై శిక్షణ సదస్సు



**హుస్నాబాద్, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హుస్నాబాద్ పురపాలక సంఘం కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా వ్యాపార వేత్తలకు, ఆర్‌పీలకు ఉద్యమ రిజిస్ట్రేషన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి హాజరై, మహిళలు వ్యాపారాలు ప్రారంభించేలా విస్తృతంగా లోన్లు అందించాలని సూచించారు. మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ హన్మంత రెడ్డి మహిళా సంఘాల ప్రతినిధులకు ఉద్యమ రిజిస్ట్రేషన్ అవసరంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, జిల్లా ఈడిసి మేనేజర్ శిరీష, సిబ్బంది రాజు, మెప్మా ఆర్‌పీలు, పట్టణ సమాఖ్య ఓబీలు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కోసం కొండగట్టులో ప్రత్యేక పూజలు



**కరీంనగర్ , ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని కోరుతూ కొండగట్టులో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర చిరంజీవి యువత ఆధ్వర్యంలో వేల్పుల వెంకటేష్ నేతృత్వంలో ఆంజనేయ స్వామి ఆలయంలో తమలపాకులతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, రామ్ చరణ్ అభిమాన సంఘాల ఇన్‌చార్జ్‌లు కపిల్ మాధవ మిడిదొడ్డి, గాలిపెల్లి కుమార్, దిలీప్ రెడ్డి, అనిల్, నాగరాజ్, రాజేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్ ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని అభిమానులు ప్రార్థనలు చేశారు.

# శ్రీ మఠం హుండీ ఆదాయం రూ. 3.25 కోట్లు

## శ్రీమఠ మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు



**మంత్రాలయం, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ. 3,25,96,854లు సమకూరినట్లు మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు బుధవారం వెల్లడించారు. బంగారం 47 గ్రాములు, వెండి 592 గ్రాములను భక్తులు కానుకులుగా హుండీ లో సమర్పించుకున్నారని మేనేజర్ తెలిపారు.

## స్థానికంగా ఉండని మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**హుస్నాబాద్, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ మున్సిపాలిటీలో స్థానికంగా ఉండని అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని హుస్నాబాద్ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. పాలకవర్గం అజమాయిషీ లేకపోవడంతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. కమిషనర్, టిపిఎస్ సహా సిబ్బంది ఇతర ప్రాంతాల నుంచి విధులకు హాజరవుతూ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని, అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్, రాష్ట్ర మున్సిపల్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.రెండు రోజుల్లోగా చర్యలు తీసుకోకపోతే మున్సిపల్ కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు.

## ఆర్టీసీని ప్రభుత్వంలో వెంటనే విలీనం చేసి సమ్మె విరమింప చేయాలనీ బుర్ర శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

**హుస్నాబాద్, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జరుగుతున్న సమ్మె వెనుక బిఆర్ఎస్ కుట్ర ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని బిఆర్ఎస్ నాయకుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు.బుధవారం హుస్నాబాద్ డిపో ఎదుట కార్మికులకు మద్దతుగా జరిగిన ఆందోళనలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం కార్మికుల డిమాండ్లను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కార్మికులు కోరుతున్నారని, వాటిని పక్కన పెట్టి బిఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేయడం మంత్రికి తగదని అన్నారు.ఆర్టీసీని ప్రభుత్వంలో వెంటనే విలీనం చేసి కార్మికుల సమ్మెను విరమింప చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమ్మె కారణంగా ప్రజా రవాణా స్తంభించిందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బిఆర్ఎస్ పార్టీ తరపున ఆయన రాష్ట్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.

## లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు - సిపి గౌష్ ఆలం



**కరీంనగర్, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: కరీంనగర్ పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా టీవీఎస్ ఎక్సెల్ వాహనాలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకున్నారు.పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, అంజయ్య మరియు సిబ్బంది నిఘా పెట్టి సరైన పత్రాలు లేని 140 వాహనాలను సీజ్ చేశారు. ఎంవీ యాక్ట్ ప్రకారం జరిమానాలు విధించి, వాహనదారులకు పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు.డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం ప్రమాదకరమని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి హెచ్చరించారు. రహదారి భద్రత కోసం ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

## 141వ మే డే వారోత్సవాలు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ పిలుపు

**కరీంనగర్, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



141వ మే డే వారోత్సవాలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య పిలుపునిచ్చారు. బుధవారం బద్ద ఎల్లారెడ్డి భవన్‌లో జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో మే డే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టేకుమల్ల సమ్మయ్య మాట్లాడుతూ 1886లో కార్మికులు చేసిన వీరోచిత పోరాటాన్ని స్మరించుకోవడానికి మే 1న గ్రామాలు, పట్టణాలు, కంపెనీలు, కార్ఖానాలు, లేబర్ అడ్డాలలో ఎర్రజెండాలు ఎగరేస్తారని తెలిపారు. నేడు కార్మిక హక్కులను కాలరాస్తూ సంస్కరణల పేరుతో చట్టాలను కుదించి కార్మికులను మళ్లీ బానిసత్వంలోకి నెట్టివేయాలని జరుగుతున్న ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయడానికి కార్మిక వర్గం పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు కాసెట్టి లక్ష్మయ్య, కార్యదర్శి పిట్టల సమ్మయ్య, పిట్టల శ్రీనివాసు, బెజ్జంకి కాళిదాస్, సభ్యులు శ్రీనివాసు, ఆగయ్య, రాజు, కుమారు ఓదెలు, మల్లేశం, బొజ్జ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ రద్దు చేయాలని బీజేపీ నిరసన

**కరీంనగర్, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



హుజురాబాద్ రూరల్ మండలం సిర్సపల్లి శివారులో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన, రాస్తారోకో చేపట్టారు.ప్రదర్శనలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. రాస్తారోకో కారణంగా వాహనాలు స్తంభించిపోవడంతో పోలీసులు రంగంలోకి దిగారు. బీజేపీ శ్రేణులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల పర్యావరణ కాలుష్యం, భూగర్భ జలాల కలుషితం, పంటలు, పశువులకు నష్టం, ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలను పక్కన పెట్టి ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని మండిపడ్డారు. హుజురాబాద్ ప్రజలు, రైతులు, అన్ని వర్గాలు నెల రోజులుగా జేఏసీగా ఏర్పడి నిరసనలు, నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ఈ విషయంలో రాజకీయ డ్రామాలు ఆడుతున్నాయని, ప్రజల భవిష్యత్తు కోసం నిజమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.డంపింగ్ యార్డ్ రద్దు ప్రకటన వెంటనే చేయకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రాల నిర్మల రెడ్డి, జిల్లా నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచులు, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించాలి

### కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
యాసంగి ధాన్యం కొనుగోళ్లకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం చిగురుమామిడి మండలం పీచుపల్లి, లంబాడిపల్లి గ్రామాల్లో, అలాగే కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆర్డీవో మహేశ్వర్, సివిల్ సప్లై ఆఫీసర్ నర్సింగరావు, డీఎం రజనీకాంత్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు తాగునీరు, నీడ వంటి వసతులు తప్పనిసరిగా ఉండాలని, అకాల వర్షాల



కారణంగా నష్టం వాటిల్లకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. తూకం, తేమ యంత్రాలు సరిగా పనిచేయాలని, అవసరమైతే వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు.ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో కొనుగోళ్లు చేపట్టాలని, రైతులు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఏఎన్ఎం సేవలు అందుబాటులో ఉండాలని అన్నారు. గత ఏడాది కొనుగోలు గణాంకాలను పరిశీలించి ప్రస్తుత యాసంగి కొనుగోళ్లకు సన్నద్ధం కావాలని, మండలాల వారీగా రెవిన్యూ, సివిల్ సప్లై అధికారులు సంయుక్తంగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని పరిష్కరించాలని, ధాన్యం మిల్లింగ్‌కు త్వరితగతిన తరలించేలా చూడాలని సూచించారు.కార్యక్రమంలో తహసిల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వికలాంగ కవి ఓదెల నరేష్‌కు ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి


**గంగాధర, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తి గ్రామానికి చెందిన వికలాంగుడు ఓదెల నరేష్ 2011 నుండి నిరంతరం కవితలు రాస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఇటీవల “నువ్వు-నేను” అనే కవిత రాసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా విస్తృతంగా వైరల్ అయింది. డిగ్రీ, ఐటీఐ వరకు చదువుకున్న నరేష్ అనేక పోటీ పరీక్షలు రాసినా విజయం సాధించలేక నిరాశ చెందుతున్నాడు. ఇటీవల గ్రూప్-4 పరీక్షలో మూడు మార్కుల తేడాతో విఫలమయ్యాడని తెలిపాడు. చిన్ననాటి నుంచే కవితా రచనలో ప్రతిభ కనబరుస్తూ హైదరాబాద్ రవీంద్రభారతి, ఢిల్లీ, తమిళనాడులో అనేక అవార్డులు అందుకున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన నరేష్‌ను రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం గుర్తించి స్పెషల్ కేసు కింద ఉద్యోగం కల్పించాలని ఆయన కోరుతున్నాడు. వికలాంగుడైనా కవితా రచనలో ప్రతిభ చూపుతూ ఆదర్శంగా నిలుస్తున్న నరేష్‌కు ఉద్యోగం కల్పించడం ద్వారా కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన విజ్ఞప్తి చేశాడు.

## ఓటు హక్కు ప్రత్యేక సవరణకై స్పెషల్ మ్యాపింగ్ సమాచారం

**కరీంనగర్, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



భారత ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిన ఓటర్ ప్రత్యేక సవరణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా 2002లో ఓటరుగా ఉండి 2025లో ఓటర్ జాబితాలో ఉన్నవారు తమ వివరాలను మ్యాపింగ్ చేసుకోవచ్చు. 2002 తర్వాత ఓటు హక్కు పొందిన వారు తప్పనిసరిగా తల్లిదండ్రుల వివరాలతో బూత్ లెవెల్ అధికారిని కలిసి ప్రస్తుత ఓటర్ వివరాల్లో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలి. ఓటర్లు తమ పోలింగ్ కేంద్రం, ఇంటి నంబర్ వివరాలను అందించి రికార్డులను సరిచూసుకోవాలి.ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసుకోవడం ద్వారా ఓటు హక్కు కలిగిన సంతానం వివరాలను కూడా యాడ్ ప్రోజెనీ చేయించుకోవచ్చు. ఏవైనా సందేహాలు ఉంటే కరీంనగర్ అర్బన్ తహసిల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఎన్నికల నమోదు అధికారి సూచించారు.ఓటర్లందరూ తమ వివరాలను సరిచూసుకొని ఈ ప్రత్యేక మ్యాపింగ్‌లో భాగస్వామ్యం కావాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.ఎన్నికల సంబంధిత సమాచారం కోసం ఎల్లప్పుడూ అధికారిక ఎన్నికల కమిషన్ లేదా స్థానిక ఎన్నికల అధికారులను సంప్రదించడం మంచిది.

# గణేష్ నగర్‌లో దోమల నివారణ తక్షణ చర్యలు

**కరీంనగర్, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పట్టణంలోని గణేష్ నగర్ 57వ డివిజన్ బైపాస్ రోడ్‌లోని పెద్ద మోరి ప్రాంతంలో దోమల సమస్య తీవ్రంగా పెరిగింది. స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ--శ్రీనివాస్ ఈ సమస్యను గుర్తించి మున్సిపల్ అధికారులకు తెలియజేశారు.తక్షణ చర్యగా ఏప్రిల్ 22వ తేదీ సాయంత్రం 57వ డివిజన్ పరిధిలోని వీధుల్లో



మస్కిటో ఫాగింగ్ నిర్వహించారు. చికెన్ గున్యా, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులకు కారణమయ్యే దోమల నివారణ కోసం కెమికల్ పొగ వదిలి ప్రజలకు ఉపశమనం కల్పించారు.ప్రజల సమస్యను ముందుండి పరిష్కరించిన కార్పొరేటర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## విజయవంతంగా ముగిసిన ఎస్ఎఫ్ఐ మోడల్ ఈఏపీసెట్ ఆన్లైన్ పరీక్షలు



**కరీంనగర్, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
:భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ ఈఏపీసెట్ ఆన్లైన్ పరీక్షలు విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ విద్యార్థులు దృఢ సంకల్పంతో ముందుకు సాగి ప్రతి పరీక్షలో విజయాలు సాధించాలని సూచించారు. కంప్యూటర్ పరిజ్ఞానం నేటి తరానికి అత్యంత అవసరమని, టెక్నాలజీతో పోటీ పడుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. గత ఆరు రోజులుగా విద్యార్థులు, తల్లిదండ్రుల నుండి విశేష స్పందన లభించిందని, ఈ పరీక్షలు విద్యార్థులకు ప్రధాన పరీక్షలకు ముందు మంచి ప్రాక్టీస్ అవుతున్నాయని ఆయన తెలిపారు. ఎస్ఎఫ్ఐ చదువుతూ పోరాడు -- చదువుకై పోరాడు అనే నినాదంతో విద్యార్థుల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అసంపెల్లి వినయ్ సాగర్, జిల్లా సహాయక కార్యదర్శులు దుర్గం బోగేష్, గట్టు ఆకాష్, కమిటీ సభ్యులు గన్నరపు రాకేష్, అంబల సందేశ్, బెజ్జల సన్నిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల అభ్యున్నతే లక్ష్యం

**- సర్దార్ రవీందర్ సింగ్**



**కరీంనగర్, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇటీవల జరిగిన కేడీసీసీ బ్యాంక్ ఆటో యూనియన్ అడ్డా నెంబర్-2 ఎన్నికల్లో విజయం సాధించిన కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం నూతన పదవీదారులకు మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, 58వ డివిజన్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బండారి సంపత్, కోశాధికారిగా చిట్టిమల్ల నాగభూషణంను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ ఆటో కార్మికులు నగర రవాణా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సంక్షేమం కోసం నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్మికుల సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా సంఘం నాయకత్వం ముందుండాలని సూచించారు. ఆటో కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు వారి జీవనోపాధి మెరుగుపరచడానికి అన్ని స్థాయిల్లో కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుని కార్మికుల అభ్యున్నతికి కట్టుబడి పనిచేయాలని నూతన కమిటీని ఆయన ఆకాంక్షించారు.

## పంటల మార్పిడి వైపు రైతులు రావాలి: రైతు కమిషన్



**హైదరాబాద్, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రంలో పంటల మార్పిడి విధానంపై రైతు కమిషన్ కార్యాలయంలో సమావేశం జరిగింది. కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధ్యక్షతన సభ్యులు కె.వి.ఎన్. రెడ్డి, రాములు నాయక్, రాం రెడ్డి గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్, భవానీ రెడ్డి, భూమి సునీల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూసార పరీక్షలు, పంటల మార్పిడి ప్రాముఖ్యతపై చర్చించారు. రైతులు వరి, పత్తి, మొక్కజొన్న వంటి ప్రధాన పంటల వైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారని, భూసార పరీక్షల ఆధారంగా తగిన పంటలు సాగు చేయడం తగ్గిపోయిందని అభిప్రాయపడ్డారు. కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భూసార కిట్ల పంపిణీ జరుగుతున్న నేపథ్యంలో రైతులు తృణధాన్యాలు, పప్పుదినుసులు, కూరగాయల పంటలు సాగు చేయాలని సూచించారు. దీంతో రైతులకు లాభం కలుగుతుందని, రాష్ట్రంలో అన్ని రకాల ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. కూరగాయలతో పాటు కొన్ని పంటల సాగు తగ్గిపోవడంతో ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని గుర్తుచేశారు. పంటల మార్పిడి చేసే రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని కమిషన్ బృందం స్పష్టం చేసింది.

## పంగోలిన్‌ను అక్రమంగా తరలిస్తూ అటవీ అధికారులకు చిక్కిన స్మగ్లర్స్..!



**న్యూఢిల్లీ ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అంతరించిపోతున్న జీవుల జాబితాలో ఉన్న పంగోలిన్ ను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు స్మగ్లర్లను అటవీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి బతికి ఉన్న పంగోలిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పంగోలిన్‌ను అక్రమంగా తరలిస్తున్నారని తమకు అందిన పక్కా సమాచారం మేరకు తాము నిఘా వేసి నిందితులను పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్ లో స్మగర్లను పట్టుకున్నట్లు అక్కడి పోలీసులు చెప్పారు. పంగోలిన్‌లు, పులి చర్మాలు, ఏనుగు దంతాలను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందడంతో తాము నిఘా పటిష్టం చేశామని రాయ్‌పూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చంద్రప్రకాశ్ మహోబియా అన్నారు. మూడు వారాలు ముఠాను వెంబండించి కొనుగోలుదార్లుగా నటించి పట్టుకున్నామని చెప్పారు. అయితే కొందరు తమకు తాము అమ్మడానికి వచ్చామని, వాటిని ఎక్కడి నుంచి తెచ్చారో తమకు తెలియదని స్మగ్లర్లు చెప్పినట్లు వెల్లడించారు. కాగా, అంతరించిపోతున్న జీవుల జాబితాలో ఉన్న ఈ పంగోలిన్‌ను తెలంగాణలో అలుగు అంటారు.

### పోలీసు అధికారికి

## బీజేపీ ఎమ్మెల్యే బెదిరింపులు

**మధ్యప్రదేశ్ ఐపీఎస్ అధికారుల సంఘం అభ్యంతరం**



**శివ్‌పురి : ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తన ఎస్‌యూవీతో ఐదుగురు వ్యక్తులను గాయపరిచి రోడ్డు ప్రమాదానికి కారకుడైన తన కుమారుడిని పోలీసు స్టేషన్‌కు పిలిచి ప్రశ్నించినందుకు సబ్ డివిజనల్ పోలీసు అధికారి ఆయుష్ జాకఢ్‌ని 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని, లేని పక్షంలో పేడతో ఇంటిని నింపివేస్తానని బెదిరించిన బీజేపీ ఎమ్మెల్యే ప్రీతమ్ లోధిపై మధ్యప్రదేశ్ ఐపీఎస్ అధికారుల సంఘం తీవ్ర ఆగ్రహం ప్రకటించింది. పిఛోర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మొదటిసారి ఎమ్మెల్యే లోధి ఉపయోగించిన అమర్యాదకర, బెదిరింపు భాషపై ఐపీఎస్ అధికారుల సంఘం అభ్యంతరం తెలిపింది. ఎమ్మెల్యేపై రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సంఘం డిమాండ్ చేసింది. ఏప్రిల్ 16న జరిగిన రోడ్డు ప్రమాదంతో వివాదం రేకెత్తింది. లోధి కుమారుడు దినేశ్ లోధి తన థార్ జీపుతో ఐదుగురు వ్యక్తులను గాయపరిచినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ ఘటనలో ముగ్గురు యువకులు, ఇద్దరు మహిళలు గాయపడ్డారు.

## హర్మూజ్ గుండా రాకపోకల కోసం బ్రిటన్, ఫ్రాన్స్ సన్నాహాలు




**న్యూఢిల్లీ ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమెరికా కవ్వింపుల చర్యలతో పశ్చిమాసియాలో హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేసిన విషయం తెలిసిందే. నెలల తరబడి యుద్ధం కారణంగా చమురు రవాణా నిలిచిపోయి ప్రపంచంలో ఇంధన సంక్షోభానికి దారితీసింది. ఇరాన్‌కు సంబంధించిన పోర్టులపై యూఎస్ దిగ్బంధం విధించడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈక్రమంలోనే హర్మూజ్ గుండా చమురు నౌకల రాకపోకలు సహజవుగా సాగేందుకు ఫ్రాన్స్, బ్రిటన్ కలిసి పని చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా అందుకు సంబంధించిన సన్నాహాలు మొదలు పెట్టింది. 30కి పైగా దేశాలకు చెందిన సైనిక నిపుణులు ఉత్తర లండన్‌లోని నార్త్‌వుడ్‌లో ఉన్న యూకే శాశ్వత సంయుక్త ప్రధాన కార్యాలయంలో బుధవారం నుంచి రెండు రోజులు సమావేశాలు జరుగుతాయని యూకే రక్షణ మంత్రిత్వ శాఖ అధికారిక పత్రికా ప్రకటనలో తెలిపింది. హోర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడమే లక్ష్యంగా ఒక సమన్వయ ప్రణాళికను అభివృద్ధి చేసేందుకు యూకే, ఫ్రాన్స్‌ల నేతృత్వంలో ప్రయత్నం పేర్కొంది. యూకే-ఫ్రాన్స్ నాయకత్వంలో సుస్థిరమైన కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత, పరిస్థితులు అనుమతించిన వెంటనే జలసంధిని తిరిగి తెరవడానికి అవసరమైన సైనిక ప్రణాళికలను ఈ సమావేశాలు ముందుకు తీసుకువెళ్తాయని పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

గత వారం పారిస్‌లో యూకే, ఫ్రాన్స్ ఆధ్వర్యంలో.. 51 దేశాల ప్రతినిధులను మధ్య అంతర్జాతీయ శిఖరాగ్ర సమావేశంతో ఈ చొరవ తీసుకున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

## ఆన్‌లైన్ గేమింగ్‌పై కొత్త మార్గదర్శకాలు..


**మే 1 నుంచి అమలుకు ఆదేశం**



**న్యూఢిల్లీ ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేశంలో ఆన్‌లైన్ గేమింగ్ ఆడేవారి కోసం కేంద్రం కొన్ని కొత్త రూల్స్ తీసుకొచ్చింది. గేమ్స్ ఆడేవారికి మేలు కలిగేలా కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ తాజాగా కొత్త రూల్స్‌పై మార్గదర్శకాలు విడుదల చేసింది. వచ్చే మే 1 నుంచి ఈ కొత్త రూల్స్ అమలుకాబోతున్నాయి. దేశంలో ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ చాలా పెద్దది. స్మార్ట్‌ఫోన్స్, ఇంటర్నెట్ డాటా తక్కువ ధరలో అందుబాటులో ఉండటం వంటి కారణాలతో చాలా మంది గేమింగ్‌వైపు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల కొందరు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారు. అయితే, ఇకపై గేమింగ్ విషయంలో కంపెనీలు కొన్ని రూల్స్ తప్పనిసరిగా ఫాలో కావాల్సిందే. సాధారణ, సోషల్ గేమ్స్‌కు సంబంధించి ఇకపై ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్స్ అవసరం లేదు. అయితే, అది ఈ స్పోర్ట్స్ అయినా.. లేదా.. కేంద్ర ప్రభుత్వం ఏదైనా ప్రత్యేక గ్రూప్‌నకు సంబంధించిన గేమ్స్ అయినప్పుడు మాత్రం రిజిస్ట్రేషన్ అవసరం. ఈ నిర్ణయం మొబైల్ గేమింగ్ స్టార్టప్స్‌కు, చిన్న డెవలపర్లకు మేలు చేస్తుంది. ఎక్కువ డాక్యుమెంట్లు వంటివి అవసరం లేకుండానే తమ గేమ్స్‌ను మార్కెట్లోకి తీసుకురావొచ్చు. మనీ సంబంధిత గేమ్స్, ఎక్కువ మంది కలిసి ఆడే గేమ్స్, హై రిస్క్ ఉన్న టైటిల్స్, అన్ని రకాల ఈ స్పోర్ట్ సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందే. ఇప్పటికి ప్రత్యేక కేటగిరి అంటూ లేదు. కానీ, త్వరలోనే వీటిని కేటగిరిలుగా విభజిస్తారు. కొత్త రూల్స్ ప్లేయర్స్‌కు మరింత మేలు చేస్తాయి. వారికి మరింత భద్రత కల్పిస్తాయి. ఆటగాళ్ల ఫిర్యాదులకు కంపెనీలు ప్రాధాన్యమివ్వాలి. అలాగే, సైబర్ సెక్యూరిటీ, సేఫ్ పేమెంట్ మానిటరింగ్, రెగ్యులర్ రిపోర్టింగ్ వంటి వాటికి అవకాశం ఇవ్వాలి. ఈ రూల్స్ వల్ల మొబైల్ ఫోన్లలో గేమ్స్ ఆడే వారు మరింత సులభంగా, భద్రంగా గేమ్స్ ఆడుకోవచ్చు. ఇక, ఈ గేమ్స్, నిబంధనల్ని పర్యవేక్షించేందుకు కేంద్రం తాజాగా ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీని కూడా ఏర్పాటు చేసింది. ఇందులో ఫైనాన్స్, బ్రాడ్‌కాస్టింగ్, హెల్త్, స్పోర్ట్స్, పవర్, జస్టిస్, విదేశీ వ్యవహారాల శాఖలకు చెందిన ప్రతినిధులు ఉంటారు. వీరు.. ఆన్‌లైన్ గేమింగ్ సంస్థల రిజిస్ట్రేషన్స్, ఫిర్యాదులు, భద్రత వంటి అంశాల్ని పర్యవేక్షిస్తారు.

## కాశ్మీర్‌లో మళ్లీ పుంజుకున్న పర్యాటకం..

**భారీ సెక్యూరిటీ మధ్య పహల్గాంలో తెరుచుకున్న కేంద్రాలు**



**న్యూఢిల్లీ ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పహల్గాం దాడి తర్వాత కాశ్మీర్‌లో మళ్లీ పర్యాటకం ఊపందుకుంది. గత ఏడాది పహల్గాం దాడి తర్వాత ఈ ప్రాంతంలో పర్యాటకం నెమ్మదిగా దెబ్బతింది. కానీ, ఇప్పుడు మళ్లీ పర్యాటక రంగం దూసుకెళ్తోంది. కాశ్మీర్‌లోని పహల్గాం దాడి జరిగి నేటికి ఏడాది. గత ఏడాది ఏప్రిల్ 22న పహల్గాంలోని పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేశారు. కాల్పులు జరిపి 26 మందిని హతమార్చారు. దీంతో అప్పటినుంచి ఈ ప్రాంతానికి పర్యాటకుల సంఖ్య క్రమేపీ తగ్గిపోయింది. దాడి అనంతరం మొత్తం 48 ప్రాంతాలను అధికారులు మూసేశారు. వాటిలో ఒక్కోటి నెమ్మదిగా అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఆ 48 పర్యాటక కేంద్రాల్లో 39 తిరిగి తెరుచుకున్నాయి. ఘటన జరిగిన సమయంలో అక్కడికి భద్రతా దళాలు 25 నిమిషాల తర్వాత చేరుకున్నాయి. అయితే, ఇప్పుడు ఈ మార్గం మొత్తం సెక్యూరిటీ ఏర్పాటు చేశారు. పహల్గాం నుంచి అక్కడి ప్రధాన టూరిస్ట్ కేంద్రమైన బైసరన్‌కు ఐదు కిలోమీటర్ల దూరం ఉంది. ఈ ప్రదేశంలో ఇప్పుడు భారీ భద్రత ఏర్పాటు చేశారు. సీఆర్పీఎఫ్ జవాన్లతోపాటు స్థానిక పోలీసులు ఇప్పుడు 24 గంటలపాటు కాపలా కాస్తున్నారు. మరోవైపు మారిన పరిస్థితుల నేపథ్యంలో పర్యాటకులు తరలివస్తున్నారు. కొన్ని ఆంక్షలున్నప్పటికీ ఈ ప్రాంతాన్ని సందర్శిస్తున్నారు. స్థానిక వ్యాపారం కూడా పుంజుకుంది. హోటళ్లు, షాపులు మళ్లీ కళకళలాడుతున్నాయి. టౌన్ ఎంట్రీ వద్ద టోల్ ఫీజులు కూడా భారీగా వసూలవుతున్నాయి. గత మార్చి నుంచి ఇక్కడి ఆదాయం మూడు రెట్లు పెరిగింది. ఇటీవలి కాలంలో ఇక్కడి టులిప్ గార్డెన్‌కు సందర్శకులు భారీగా పెరిగారు. ఈ సీజన్‌లో మొత్తం 1.8 మిలియన్ టులిప్ పూలు పూశాయి. వీటిని చూసేందుకు పర్యాటకులు తరలివచ్చారు. ఈ ఏడాది మార్చి 16 నుంచి గార్డెన్ మూసేసేవరకు 2,52,000 మంది సందర్శించారు.